సాక్షి అనంతపురం

బుధవారం । 13 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

బుధవారం సాయంత్రం	గురువారం ఉదయం
ఇఫ్తార్ : 6.31	సెహరీ : 5.12



న్యూస్‌రీల్

'పయ్యావుల' ప్రలోభాలు



ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకోవడంతో చీరలను పడేసి వెళ్లిన పయ్యావుల అనుచరులు

ఉరవకొండ: ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను ఓటమి భయం వెంటాడుతోంది. ఈ క్రమంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉరవకొండ పట్టణంతో పాటు రాకెట్ల తదితర గ్రామాల్లో పయ్యావుల అనుచరులు ఇంటింటికీ వెళ్లి ఓ కరపత్రంతో పాటు చీరలు అందజేస్తున్నారు. మరి కొన్ని రోజుల్లో డబ్బు కూడా ఇస్తామని నమ్మబలుకుతున్నారు. ఓటర్లకు పంపిణీ చేయడానికి కర్ణాటక మద్యం కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మంగళవారం ఉరవకొండలోని పలు ప్రాంతాల్లో చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో వారు చీరలు అక్కడే పడేసి పలాయనం చిత్తగించారు.

డిన్నర్ల రాజకీయం

ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత పయ్యావుల కేశవ్ నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఎక్కువగా విజయవాడ, హైదరాబాదుకే పరిమితమయ్యారు.నియోజకవర్గ ప్రజల అవసరాలను ఏమాత్రమూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎన్నికలు సమీపించడంతో ప్రజల ముందుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే తనదైన శైలిలో ఓటర్లను ప్రలోభ పెడుతున్నారు. కొన్ని రోజులుగా వివిధ కులాలు, చేతివృత్తిదారుల సంఘాలతో కేశవ్ సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమావేశాలకు విముఖత చూపిన సంఘాల నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు డిన్నర్ల పేరుతో ఎర వేస్తున్నారు. పయ్యావుల ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజల నుంచి మాత్రం సానుకూల స్పందన కన్పించడం లేదు. ఇన్నాళ్లు తమ బాగోగులు పట్టించుకోకుండా ఇప్పుడొస్తే ఎందుకు ఆదరిస్తామని జనం ప్రశ్నిస్తున్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లపై నివేదిక అందించండి



మాట్లాడుతున్న పీడీ రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల మంజూరు లక్ష్యం పూర్తి చేసి తుది తనిఖీల నివేదిక (ఫైనల్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు) అందజేయాలని ఏపీఎంఐపీ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీడీలు బి.రఘునాథరెడ్డి, సుదర్శన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఏ మాత్రం అలసత్వం వహించకుండా వారం రోజుల్లో తుది నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం



మాట్లాడుతున్న కుప్పం ప్రసాద్

అనంతపురం కార్పొరేషన్: చంద్రబాబు ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. రాష్ట్రం విడిపోయాక ఏటా నవంబర్ 1న జరిగే ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని చంద్రబాబు జూన్ 2కు మార్చి ఆ మహనీయుడిని అగౌరవపరిచారన్నారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత నవంబర్ 1న ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించడంతో పాటు పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారన్నారు. కన్యకా పరమేశ్వరి దేవాలయాలు ఎండోమెంట్ పరిధిలో లేకుండా దివంగత నేత వైఎస్సార్ జీఓ ఇచ్చి న్యాయం చేశారన్నారు. ఆయన తనయుడిగా మరో అడుగు ముందుకేసి అమ్మవారి ఆస్తులన్నీ సంబంధిత కుల సంఘాలకే చెందేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు పలాక్షి రెడ్డి, ఉపాధ్యక్షులు సంపత్‌కుమార్, కార్యదర్శి కలవల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చెప్పిన దానికల్లా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఊ కొడుతున్నారు. మీరేం చెబితే అదే అంటున్నారు. తమకు కేటాయించిన సీట్లలో కోత పెట్టినా అభ్యంతరం పెట్టలేదు. అయితే, జనసేన నుంచి చంద్రబాబు లాగేసుకుంటున్న సీట్లలో అనంతపురం కూడా ఉందనే వార్తలు రావడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తమ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి టికెట్టు ఖరారైందని ఇన్నాళ్లూ మురిసిపోయిన బలిజలు పవన్‌కల్యాణ్ తీరుపై మండిపడుతున్నారు.



బలిజలు భగ భగ!

- జనసేన టికెట్లలో కోత పడ్డాక అనంతపురం సీటుపై అనుమానం
- టీడీపీకే కేటాయిస్తారంటూ పలువురి ప్రచారం
- పవన్‌కల్యాణ్ తీరుపై మండిపడుతున్న బలిజలు
- విజయవాడకు బయలుదేరిన ఇరు పార్టీల నాయకులు
- భవిష్యత్తు కార్యాచరణపై జిల్లా బలిజ నేతల సమాలోచనలు
- చౌదరి ఎలా గెలుస్తారో చూస్తామంటూ హెచ్చరికలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటివరకూ 9 సీట్లు ప్రకటించారు. మరో ఐదు సీట్లు ప్రకటించాల్సి ఉంది. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా రాయలసీమలో బలిజల (కాపు)లకు కేటాయించే ఏకైక సీటు అనంతపురం అర్బన్ అని గత కొంత కాలంగా ప్రచారం జరిగింది. దీంతో ఆ కులానికి చెందిన నేతలు ఎంతో సంతోషపడ్డారు.

ఆశలు.. అడియాసలేనా!

ఓటమి భయం పట్టుకున్న చంద్రబాబు ఇటీవల బీజేపీతోనూ దోస్తీ కట్టారు. ఆ పార్టీకి కొన్ని సీట్లు కేటాయించేందుకు సిద్ధపడ్డారు. అయితే, టీడీపీ సీట్లు తగ్గించుకుని, వాటిని బీజేపీకి కేటాయించాల్సింది పోయి జనసేనకు ముందుగా ప్రకటించిన 24 సీట్లలో కోత వేశారు. అందులో భాగంగా అనంతపురం టికెట్ జనసేనకు ఇచ్చేది లేదని తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే తెలుగుదేశం పార్టీ నేత ప్రభాకర్ చౌదరి, జనసేన నేత టీసీ వరుణ్‌లు విడివిడిగా విజయవాడకు బయలుదేరి వెళ్లడం ఈ వార్తలకు బలం చేకూర్చింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో బలిజ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు రమారమి 30 వేల వరకూ ఉన్నాయి. తమ వర్గానికి చెందిన వ్యక్తికి ఈ సారి తప్పకుండా సీటొస్తుందని పెట్టుకున్న ఆశలు అడియాసలేనని తెలియడంతో ఆ కులస్తులు రగిలిపోతున్నారు. జనసేన అధినేత వైఖరిపై మండిపడుతున్నారు.

చౌదరి ఓటమే లక్ష్యం!

తమ కులస్తుడికి అనంతపురం సీటు రాకపోతే టీడీపీకి ఊడిగం చెయ్యలేమని, తమ దారి తాము చూసుకుంటామని బలిజ సామాజికవర్గ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇక్కడ పొత్తు ధర్మం లేదు, సీట్లు దానం చేయడమే కనిపిస్తోందని వాపోతున్నారు. తమను కాదని టీడీపీ తరఫున ప్రభాకర్ చౌదరిని నిలిపితే, ఆయన ఎలా గెలుస్తారో చూస్తామంటున్నారు. చంద్రబాబుకు తన సొంత సామాజిక వర్గం అభ్యర్థి ఎంత ముఖ్యమో.. తామూ అంతే ముఖ్యం కాదా అని ప్రశ్నిస్తున్నారు. పుట్టపర్తి అన్నారు..ధర్మవరం అన్నారు..అవి ఇవ్వలేదు.. చివరకు అనంతపురం సీటు కూడా లాగేసుకుంటారా అని వాపోతున్నారు. సీటు రాకపోయినా సరే చౌదరి ఓటమిని బాధ్యతగా తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. పెద్ద మనసుతో పవన్‌కల్యాణ్ సీటు త్యాగం చేసి ఉండొచ్చు.. తాము మాత్రం ప్రభాకర్ చౌదరి ఓటమిని చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తామంటూ హెచ్చరిస్తున్నారు. అంతా బాగుంటుందన్న క్రమంలో పొత్తుల పంతం రేగడంతో టీడీపీ, జనసేన కార్యకర్తలు కుమిలిపోతున్నారు.

అధినేత వైఫల్యమా.. అభ్యర్థి చేతకానితనమా?

జనసేన సీట్లు తగ్గించిన తర్వాత బలిజ సామాజిక వర్గానికి చెందిన నేతలు రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. జనసేన అధినేత చేతకానితనంతో సీట్లు తగ్గాయి అని కొందరు, ఇక్కడి అభ్యర్థిగా పరిగణించిన వ్యక్తి చేతకాని తనంతో సీటు నిలబెట్టుకోవడం లేదు అని మరికొందరు విమర్శలు చేస్తున్నారు. జనసేనకు కేటాయించిన 24 సీట్లను 21కే పరిమితం చేయడమే మోస మనుకుంటే, ఇప్పుడు అనంతపురం టికెట్టునూ జనసేన నుంచి లాక్కొంటామని అనడంపై అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని పలువురు బలిజ సామాజిక వర్గ నేతలు భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు చేస్తున్నారు.

'ఆ మృగాలను క్షమించొద్దు'



గీతాంజలి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా విభాగం నేతలు

అనంతపురం సిటీ: తెనాలికి చెందిన గీతాంజలి బలవన్మరణానికి కారకులైన మృగాలను క్షమించరాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నేతలు డిమాండ్ చేశారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణ నుంచి మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ జగనన్న తన పేరిట ఇంటి పట్టా ఇవ్వడం, తన బిడ్డకు అమ్మ ఒడి డబ్బులు వేయడంపై ఒక తల్లిగా, ఆడబిడ్డగా ఆమె తన ఆనందాన్ని పంచుకుంటే టీడీపీ–జనసేన మూకలు వీధి కుక్కల్లా ఆమెను వెంబడించాయన్నారు. మహిళ అని కూడా చూడకుండా దారుణంగా వ్యవహరించిన వారి వికృత చేష్టలకు ఇద్దరు బిడ్డల తల్లి ఆత్మహత్య చేసుకుందని ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన మూకల చేష్టలకు బలైన వారు ఎందరో ఉన్నారని ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. గీతాంజలి తన ఆనందాన్ని మీడియా ముందు వ్యక్తం చేస్తే దాన్ని వక్రీకరించి ఆమె చావుకు కారకులైన వారిని నడిరోడ్డుపై ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇద్దరు చిన్నారులకు తల్లి లేకుండా చేసిన దుర్మార్గులను వదిలిపెట్టొద్దని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీ దేశాయ్ భారతీరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు రాధా యాదవ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ శోభారాణి, మహిళా విభాగం ప్రతినిధులు భారతి, పార్వతి, శోభా, రాధ, ఉష, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాధ్యతలు చిత్తశుద్ధితో నిర్వర్తించాలి

- ప్రతి అంశంపై అవగాహన ఉండాలి
- చిన్న పొరపాటుకూ తావివ్వరాదు
- ఈఆర్‌ఓలు, సెక్టోరియల్ అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ అన్బురాజన్

అనంతపురం అర్బన్: 'సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతి అధికారి ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లిపోతారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విషయంలో అధికారులది కీలకపాత్ర. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి.' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలు, చేపట్టాల్సిన పనులు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు అవగాహన (ఓరియంటేషన్) కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్,జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపాటి పొరపాటుకూ తావివ్వకూడదన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.అప్పగించిన బాధ్యతలను విమర్శలకు తావివ్వకుండా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల్లో ఎవరిపాత్ర ఏమిటి..? బాధ్యతలు ఏమిటి..? అనుసరించాల్సిన విధివిధానాల గురించి ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌ను చదివి అవగాహన పెంచుకోవాలని చెప్పారు.

నివేదికలు సమర్పించాలి

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే వివిధ కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్, పీఓలకు ట్రైనింగ్, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎంసీసీకి సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను (విత్ సైన్డ్ కాపీస్) సమర్పించాలని ఆదేశించారు. అనంతరం నివేదికల రూపకల్పనలో అనుసరించాల్సిన విధానాల గురించి ఎన్ఐసీ డీఐఓ రవిశంకర్, ఈ–డివిజనల్ మేనేజర్ రమణారెడ్డి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి,కమిషనర్ మేఘ స్వరూప్, డీఎఫ్ఓ వినిత్‌కుమార్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు చర్యలు చేపట్టండి

'ఉష్ణోగ్రతలు పెరుగుతున్న క్రమంలో వేడి గాలుల దాటికి ప్రజలు వడదెబ్బకి గురయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో నివారణ చర్యలు తీసుకోవాలి. జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.' అని కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మున్సిపల్ ఆర్‌డీ పీవీఎస్ఎన్ మూర్తి, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, అధికారులు సంయుక్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నీటి వృథా అరికట్టేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో తప్పనిసరిగా షేడ్ నెట్స్, తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీఎంహెచ్ఓ ఈ.భ్రమరాంబదేవి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- రాష్ట్ర శ్రేయస్సు కోసమే సీఎం జగన్ పార్టీ స్థాపించారు
- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అనంతపురం కార్పొరేషన్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంటు సమన్వయకర్త మాలగుండ్ల శంకర్ నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను పైలా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించారు. ఎమ్మెల్యే శంకర్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర శ్రేయస్సు కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారన్నారు. చంద్రబాబు ప్రజాకంటక పాలనను ఎండగట్టారన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత నిధులు, పరిశ్రమల కోసం పోరాటం చేయడంతో పాటు 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 14వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. పార్టీ అధికారంలోకి రావడంలో కార్యకర్తలే కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీం అహ్మద్, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా చైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, నాయకులు ఎర్రిస్వామి రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రంగంపేట గోపాల్ రెడ్డి, చామలూరు రాజగోపాల్, డైరెక్టర్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బడుగుల అభ్యున్నతి

- మరోమారు ఆయన్ను ముఖ్యమంత్రి చేసుకుందాం
- ఎమ్మెల్యే అనంత, వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంటు సమన్వయకర్త శంకర్‌నారాయణ పిలుపు





ప్రజాప్రతినిధులు, నేతలను గజమాలతో సత్కరిస్తున్న మత్స్యకార సంఘ ప్రతినిధులు, సమావేశంలో పాల్గొన్న మత్స్యకారులు

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యపడిందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని గుత్తి రోడ్డు వద్ద ఉన్న విద్యుత్ కళాభారతి కళ్యాణ మండపంలో మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకర్‌నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు హాజరయ్యారు. దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మత్స్యకార సహకార సొసైటీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎంపికైన నగేష్, వెంకటనారాయణను సత్కరించారు. ఆ సొసైటీ డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేష్, రాజ్‌కుమార్, బాలకృష్ణ, సూరి, రామకృష్ణ, రాజేష్ నాయక్, శ్రీన నాయక్,గోవిందప్ప,నాయకులు బీకేఎస్ బూసి, జోగి రాజేంద్ర, జశ్వంత్, హేమకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ పెద్దపీట



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాలకూ పెద్దపీట వేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేలా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.మత్స్యకారుల సొంతింటి కల సాకారం చేశారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు వృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారు.

– అనంత వెంకటరామిరెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే

పెద్ద ఎత్తున పదవులు



దేశంలోనే ఎక్కడా లేని విధంగా బీసీలకు సీఎం వైఎస్ జగన్ పట్టం కట్టారు. రాజకీయంగా అవకాశాలు కల్పించారు. నామినేటెడ్ పదవులతో పాటు మేయర్, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, డిప్యూటీ సీఎంలుగా బీసీలకు అవకాశం కల్పించారు. అంబేడ్కర్ ఆశయాలను సాకారం చేశారు.

– మాలగుండ్ల శంకర్‌నారాయణ, ఎమ్మెల్యే, అనంతపురం పార్లమెంటు పార్టీ సమన్వయకర్త

మరోసారి జగనన్నను సీఎం చేసుకుందాం



బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం. వివిధ సంక్షేమ పథకాల ద్వారా బడుగులు ఆర్థిక ప్రగతి సాధించేలా సీఎం చర్యలు తీసుకున్నారు. దేశానికే ఆదర్శంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలను ఇళ్ల ముంగిటకే చేర్చారు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్


మత్స్యకారులకు రూ.4,900 కోట్లు



మత్స్యకారుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.4,900 కోట్లు అందజేశారు. బీసీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.1.55 లక్షల కోట్లు పంపిణీ చేశారు. బీసీలందరూ సీఎం వైఎస్ జగన్ వెంటే ఉన్నారు. ఆయన పాలనపై ప్రజలకు విశ్వాసం ఉంది.

– పైలా నరసింహయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎం జగన్ చర్యలు తీసుకున్నారు. ఆరోగ్య శ్రీ పరిమితి పెంచి పేదలకు సాంత్వన చేకూర్చారు. 'నాడు–నేడు' కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశారు. ఇవన్నీ బడుగుల అభ్యున్నతికి దోహదపడ్డాయి. జగనన్నకు జనమే బలం. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం.

– రమేష్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్

క్లుప్తంగా

జగనన్నను మరోసారి సీఎం చేద్దాం



సంఘీభావం తెలుపుతున్న దూదేకుల, నూర్‌బాషా సంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: జగనన్నను మరోసారి సీఎంను చేద్దామంటూ రాయలసీమ దూదేకుల, నూర్‌బాషా సంఘం మహిళ అధ్యక్షురాలు మస్తానమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురంలోని ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో ఆ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తానమ్మ మాట్లాడుతూ... దూదేకుల అభ్యున్నతికి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన కృషిని కొనియాడారు. అన్ని విధాలుగా దూదేకుల అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మేకల మందపై చిరుత దాడి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో మేకల మందపై ఓ చిరుత దాడి చేసింది. గ్రామానికి చెందిన రైతు రామ్మూర్తి తన మేకల మందను సోమవారం రాత్రి గ్రామ శివారులోని తన దొడ్డిలో వదిలి అక్కడే నిద్రపోయాడు. మంగళవారం తెల్లవారుజామున మందలోకి చిరుత చొరబడడంతో మేకలు కకావికలమయ్యాయి. అలజడికి మేల్కొన్న రామ్మూర్తి... మేకల మందపైకి ఎగబడుతున్న చిరుతను గమనించి గట్టిగా కేకలు వేస్తూ బెదరగొట్టాడు. దీంతో చిరుత కొండల్లోకి పారిపోయింది. అప్పటికే చిరుత దాడిలో తీవ్రంగా గాయపడి ఓ మేక మృతి చెందింది.

హత్య కేసులో మేనల్లుడి అరెస్ట్

అనంతపురం: మేనమామ డాక్టర్ మూర్తిరావు శోకలేను దారుణంగా హత్య చేసిన కేసులో మేనల్లుడు ఆర్.ఎం.ఆదిత్య శశాంక్‌ను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ రెడ్డప్ప వెల్లడించారు. అనంతపురంలోని ఎల్ఐసీ కాలనీలో నివాసముంటున్న ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మూర్తిరావును ఈ నెల 10న హతమార్చిన విషయం తెలిసిందే.

మేనమామ మాట నమ్మి... చదువు మానేసి

పామిడి గ్రామానికి చెందిన మూర్తిరావుకు ఐదుగురు అక్కచెల్లెళ్లు, ఓ సోదరుడు ఉన్నారు. అందరితోనూ కలుపుగోలుగా ఉండేవారు. కుటుంబసభ్యులందరి బాగోగులను ఆయనే చూసుకునేవారు. ఈ క్రమంలో తన పెద్ద అక్క నాగరత్నాబాయి కుమారుడు ఆర్.ఎం.ఆదిత్య శశాంక్ తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతుండే వాడు. ఆ సమయంలోనే ఆదిత్యతో మూర్తిరావు మాట్లాడి చదువు మధ్యలోనే వదిలేసి అనంతపురానికి వస్తే మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఆదిత్య శశాంక్ చదువు ఆపేసి మేనమామ వద్దకు చేరుకున్నాడు. అప్పటి నుంచి మేనల్లుడితో పాటు తన అక్క బాగోగులను ఆయన పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు.



ఆదిత్య శశాంక్‌ను అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు

పథకం ప్రకారం..

మేనమామ మాట నమ్మి వచ్చిన తనతో పాటు తల్లి బాగోగులూ నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన మేనమామ తీరు ఆదిత్యకు నచ్చలేదు. అంతా తాను చెప్పినట్లే జరగాలి.... అందరూ తన ఆధీనంలోనే ఉండాలన్న భావనతో తన కుటుంబాన్ని అణగదొక్కుతున్నారని మేనమామపై ఆదిత్య కసి పెంచుకున్నాడు. తన భవిష్యత్తును కాలరాసిన మేనమామను ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అనంతపురంలోని జేఎన్‌టీయూ ప్రధాన గేట్ ఎదురుగా ఉన్న మేనమామ ఇంటిలో అద్దెకు ఉంటున్న మణికంత అనే వ్యక్తి ఇల్లు ఖాళీ చేశాడు. ఈ నెల 10న రాత్రి ఇదే విషయాన్ని మూర్తిరావుకు మణికంఠ ఫోన్ చేసి తెలిపి, ఇంటి తాళం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తన భార్య శోభాబాయితో కలసి మూర్తిరావు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ కాపు కాసిన ఆదిత్య కత్తితో మూర్తిరావు గొంతుపై పొడిచి హతమార్చాడు.

రిమాండ్‌కు నిందితుడు

హత్య జరిగిన వెంటనే అప్రమత్తమైన అనంతపురం ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలో దిగాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద తచ్చాడుతున్న ఆదిత్యశశాంక్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. హత్యకు వినియోగించిన కత్తితో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరిని బలిగొన్న క్షణికావేశం

ఆదిత్య శశాంక్ క్షణికావేశంతో దారుణానికి ఒడిగట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తన కళ్ల ఎదుటే భర్తను మేనల్లుడు కత్తితో పొడిచి హత్య చేస్తున్న దారుణాన్ని చూసిన శోభాబాయి అదే రోజు రాత్రి 11 గంటలకు గుండెపోటుకు గురై మృతి చెందింది. దీంతో మూర్తి రావు కుటుంబం ఛిన్నాభిన్నమైంది. హతుడికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

'వందేభారత్'కు ఘన స్వాగతం



అనంతపురం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులతో మేయర్ వసీం, ఎమ్మెల్సీ మంగమ్మ, డిప్యూటీ మేయర్లు, తదితరులు

గుంతకల్లుటౌన్/అనంతపురం సిటీ: గుల్బర్గా–బెంగళూరు మార్గంలో వందేభారత్ రైలు పరుగులు పెట్టింది. మంగళవారం ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా గుంతకల్లు, అనంతపురంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు రైలుకు ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ మంగమ్మ, మేయర్ వసీం, గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డీఆర్ఎం వినీత్‌సింగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులూ ప్రారంభం

గుంతకల్లు డివిజన్ పరిధిలోని 22 రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసిన దుకాణాలతో పాటు తిరుపతిలో జన ఔషధి, నక్కనదొడ్డి ఐఓసీ డిపోలో గతిశక్తి టెర్మినల్, గుంతకల్లు–గుంటూరు మధ్య పూర్తయిన 303 కి.మీ రైలు మార్గం, అనంతపురం శివార్లలోని ప్రసన్నాయపల్లిలో గూడ్స్‌షెడ్ తదితర అభివృద్ధి పనులనూ వర్చువల్ పద్ధతిలో ప్రధాని మోదీ ప్రారంభించారు.

లక్ష్య సాధన దిశగా డీసీసీబీ

- నెలాఖరుకు రూ.2 వేల కోట్లు లక్ష్యం
- డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరం వ్యాపార లక్ష్య సాధన దిశగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అడుగులేస్తోందని ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సవం ముగిసేలోపు రూ.2 వేల కోట్ల వ్యాపార లక్ష్యం నిర్దేశించుకోగా, ఇప్పటికే 1,900 కోట్ల టర్నోవర్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతపురంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పాలవర్గ సమావేశం మంగళవారం జరిగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ... రైతులకు పెద్ద పీట వేస్తూనే మిగిలిన అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధికి పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేస్తుండాన్ని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ నెలఖారుకు రూ.2 వేల కోట్ల లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని సూచించారు. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) గణనీయంగా తగ్గించడంలో భాగంగా మొండిబకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహంతో రైతులు, వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చామన్నారు. డీసీసీబీ ద్వారా అన్ని వర్గాలకు లబ్ధి జరిగేలా ప్రభుత్వ ప్రయోజనాలు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, డైరెక్టర్లు వై.జనార్దన్‌రెడ్డి, హైదర్‌వలీ, రామాంజినేయులు, ప్రొఫెషనల్ డైరెక్టర్లు రమణమూర్తి, జనరల్ మేనేజర్ కె.సురేఖారాణి, డీజీఎం సుఖదేవబాబు, ఆప్కాబ్ డీజీఎం సురేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు

- అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి



కవాతులో పాల్గొన్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవ్‌రెడ్డి, డీఎస్పీ, సీఐలు, కేంద్ర బలగాలు

ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రతపై ప్రజలకు భరోసా కల్పించేందుకే రేంజ్ పరిధిలోని వివిధ పట్టణాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసుల కవాతును చేశారు. ఈ సందర్భంగా డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ... ఎన్నికలు ప్రశాంతంగా వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. కేంద్ర సాయుధ బలగాలు పాటించాల్సిన ఎన్నికల నియమావళి, సమస్యలు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ సందర్భంగా డీఐజీ వివరించారు. ఎస్పీ మాధవ్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ గౌతమ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సబ్ డివిజన్‌లోని సీఐలు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్, యతీంద్ర, కృష్ణంరాజు, శివాంజనేయులు, ఎస్ఐలు, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

రూ.273.43 కోట్లతో 843 భవనాలు పూర్తి

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గ్రామ సచివాలయం, రైతు భరోసా, హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాలను వేగవంతం చేసినట్లు పంచాయతీరాజ్ (పీఆర్) ఎస్ఈ ఈరస్వామి తెలిపారు. ఇప్పటికే రూ.273.43 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన 843 భవనాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేసినట్లు వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ వెలువడేలోపు వీటన్నింటినీ ప్రారంభిస్తామన్నారు. మంగళవారం రాయదుర్గం పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక డీఈ కార్యాలయంలో ఈఈ చంద్రశేఖర్, డీఈ రామమోహన్‌రెడ్డి, డీఏఓ శంకర్‌తో కలసి సిబ్బందితో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 364 సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టగా రూ.126.16 కోట్ల వ్యయంతో 344 భవనాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన భవనాల పనులు చివరి దశల్లో ఉన్నాయన్నారు. 362 రైతు భరోసా కేంద్రాలకు గాను రూ.58.16 కోట్ల వ్యయంతో 299 పూర్తయ్యాయని, 268 హెల్త్ క్లినిక్‌లకు గాను రూ.39 కోట్ల వ్యయంతో 200 భవనాలు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించినట్లు గుర్తు చేశారు. రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 40 భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

బాలిక అదృశ్యంపై ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

కళ్యాణదుర్గం: స్థానిక పార్వతీనగర్‌కు చెందిన 18 ఏళ్ల వయసున్న బాలిక అదృశ్యమైన ఘటనపై ప్రత్యేక బృందాలను రంగంలో దింపి దర్యాప్తు వేగవంతం చేసినట్లు డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఘటనపై తల్లి ఈ నెల 9న చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారన్నారు. ఈ క్రమంలో తన కుమార్తె అదృశ్యంపై సామాజిక మాధ్యమాల వేదికగా బాలిక తల్లి చేసిన ఆరోపణలను డీఎస్పీ బి.శ్రీనివాసులు ఖండించారు. ఇప్పటికే బృందాలుగా పోలీసులు విడిపోయి ఆధునిక టెక్నాలజీ సాయంతో బాలిక ఆచూకీ కనుగొనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బాలిక అదృశ్యానికి ప్రేమ వ్యవహారమే కారణమై ఉంటుందనే కోణంలోనూ విచారణ చేపట్టామన్నారు. త్వరలో ఈ కేసులోని మిస్టరీని ఛేదించి, బాలికను సురక్షితంగా తల్లి వద్దకు చేరుస్తామని స్పష్టం చేశారు.

తండ్రితో ఘర్షణ.. కుమారుడి మృతి



మురళి మృతదేహం

గుంతకల్లు రూరల్: తండ్రితో ఘర్షణ పడిన వ్యసనపరుడైన ఓ యువకుడు అస్వస్థతకు లోనై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని దోనిముక్కల ప్రాంతం నాగప్పగుట్ట కాలనీకి చెందిన మునిస్వామి కుమారుడు మురళికి (28)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న మురళి మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరగడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న మురళిని తండ్రి మునిస్వామి మందలించాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో క్షణికావేశానికి లోనైన మునిస్వామి ఇంట్లో బండలు తుడిచే కర్ర (మాప్)తో మురళిని కొట్టాడు. తలకు చిన్నపాటి గాయం కావడంతో వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు రాత్రికే తిరిగి ఇంటికి పిలుచుకెళ్లాడు. మంగళవారం ఉదయం నిద్రలేచిన తర్వాత అస్వస్థతకు లోనైన కుమారుడిని గమనించి వెంటనే ఆస్పత్రికి పిలుచుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులు

- ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్
- ఘనంగా ఆర్ట్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే



పట్టా అందజేస్తున్న పోలా భాస్కర్, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: చదువు పూర్తవగానే ఉపాధి దక్కేలా ఉన్నత విద్యలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మ మార్పులు తీసుకువచ్చిందని ఉన్నత విద్య శాఖ కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల రెండో గ్రాడ్యుయేషన్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కమిషనర్ పోలా భాస్కర్ హాజరై మాట్లాడారు. విద్యార్థిని తరగతి గదికే పరిమితం చేయకుండా పరిశ్రమతో అనుసంధానం చేయడం ద్వారా మెరుగైన జీవనోపాధి కల్పించేలా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఈ క్రమంలో మెరుగైన బోధన చేసేలా వివిధ అంశాలపై అధ్యాపకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. చదువులో షార్ట్ కట్స్ పనికిరావన్నారు. కష్టపడితేనే లక్ష్యాలు నెరవేరతాయన్నారు. వైఫల్యాలకు ఇతరులను నిందించకుండా, పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. ఎస్కేయూ వీసీ డాక్టర్ హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ ఎందరో మేధావులను తయారుచేసిన ఆర్ట్స్ కళాశాలలో చదువుకోవడం అదృష్టంగా భావించాలన్నారు. క్రమశిక్షణ, సరైన వైఖరి, కష్టపడే తత్వం ఎవరినైనా ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయన్నారు. ప్రిన్సిపాల్ ఏపీఆర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రోబోలుగా అభివృద్ధి చెందాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. యూజీ, పీజీ కోర్సులు పూర్తి చేసి విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీలను కమిషనర్ పోలా భాస్కర్, వీసీ హుస్సేన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఏజీఓ తులసి, ఆర్‌జేడీ నాగలింగారెడ్డి, ఎస్కే యూనివర్సిటీ సీఓఈ కృష్ణా నాయక్, సీఈ చలపతి, సీపీడీసీ సభ్యులు చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడిలో వరుస చోరీలు

పామిడి: స్థానిక వెంగమనాయుడు కాలనీలో మంగళవారం వేకువజామున వరుసగా మూడు ఇళ్లలో దుండగులు చొరబడి విలువైన ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... వెంగమనాయుడు కాలనీకి చెందిన సుధాకర్, బాబావలి అత్యవసర పనిపై ఊరెళ్లారు. ఈ క్రమంలో వారి కుటుంబసభ్యులు రాత్రి స్థానికంగానే సమీప బంధువుల ఇళ్లకు వెళ్లి నిద్రించారు. విషయాన్ని గమనించి దుండగులు తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. రెండిళ్లలోనూ ఓ తులం బంగారు, పది తులాల వెండి ఆభరణాలు అపహరించారు. అనంతరం అదే కాలనీకి చెందిన చంద్రశేఖర్ కిరాణా దుకాణంలో చొరబడి రూ.25 వేలు నగదు అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను, దుకాణాన్ని మంగళవారం ఉదయం పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వరుని హుండీ ఆదాయం రూ.7.77 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, ధర్మకర్తలు

అనంతపురం కల్చరల్: మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలోని హుండీని మంగళవారం ఎండోమెంట్ అధికారుల సమక్షంలో లెక్కించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 1 నుంచి 11 వరకు పార్వతీ పరమేశ్వరుల బ్రహ్మోత్సవ వేడుకల్లో భక్తులనుంచి రూ.7,77,464 ఆదాయం లభించినట్లు దేవదాయశాఖ ఉత్సవాల అధికారిణి కె.రాణి, ఆలయ ఈవో రమేష్‌బాబు తెలిపారు.

రామకృష్ణ పరమహంస జీవితం ఆదర్శప్రాయం


ఆధ్యాత్మిక గ్రంథాలను వితరణ చేస్తున్న ఆత్మవిదానంద సరస్వతీ

అనంతపురం కల్చరల్: భారతీయ ఆధ్యాత్మికతను విశ్వవ్యాప్తం చేసిన మహనీయులలో రామకృష్ణ పరమహంస ముందు వరుసలో ఉంటారని స్వామి ఆత్మవిదానంద సరస్వతీ అన్నారు. శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం హెచ్చెల్సీ కాలనీలోని సమితి ప్రాంగణంలో రామకృష్ణ పరమహంస జయంతి, రామకృష్ణ పఠనామృతం జరిగింది. శ్రీధర మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా చిన్మయామిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి, సంస్కృత పండితులు కాశీవిశ్వేశ్వ శర్మ, డాక్టర్ కృష్ణ శశి పాల్గొని రామకృష్ణ పరమహంస ఆదర్శప్రాయ జీవితాన్ని వివరించారు.

తబ్రేజ్ ఖాన్‌కు డాక్టరేట్




అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగంలో పరిశోధన చేసిన కే.తబ్రేజ్ ఖాన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పి.ఓబుళరెడ్డి పర్యవేక్షణలో 'రివైసిటింగ్ ఛార్లెస్ డికెన్స్ –ఏ కాంటింపెరరీ అప్రోచ్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న విజయ్‌సాయికుమార్

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త విజయ్‌సాయికుమార్ సోషల్ ఇంపాక్టు అవార్డు అందుకున్నారు. ఏపీ సిటిజన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కోల వేంకటేశ్వరరావు చేతుల మీదుగా విజయ్‌సాయికుమార్ అవార్డు అందుకున్నారు.

వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు సౌత్ పాఠశాలలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చూపు సరిగా లేనివారికి వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మినరసింహులు,యూత్ కన్వీనర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు రూరల్: ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలపై అవగాహన కల్పించేందుకు అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లి, చియ్యేడు, పూలకుంట, ఉప్పరపల్లి గ్రామాల్లో డీఎస్పీ వెంకటశివారెడ్డి నేతృత్వంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల సమయంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అందరూ సహకరించాలని రూరల్ డీఎస్పీ బీవీ శివా రెడ్డి, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ధర్మేంద్ర సింగ్ ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 49వ డివిజన్‌లో ఘనంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం


సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ ఆశయసాధనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారని, ఈక్రమంలో పెద్ద ఎత్తున ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అనంతపురం నగరం 49వ డివిజన్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అజెండా అని అన్నారు. పార్టీ ఆవిర్భవించి 13 సంవత్సరాలు పూర్తయి నేడు 14వ వసంతంలోకి అడుగు పెట్టిందన్నారు. వైఎస్ జగన్ వెన్నంటి ఉన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 58 నెలల్లో రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చిందన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. ఏపీ పాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతామన్నారు. రెండో పర్యాయం జగనన్నను సీఎంను చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

సీఎంగా వైఎస్ జగన్ ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 49వ డివిజన్ ఇందిరా గాంధీనగర్‌లో మంగళవారం ఆయన ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఆధిపత్య పోరుతో అభివృద్ధి అటకెక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతపురం నియోజకవర్గంలో దాదాపు 3వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు అయ్యాయని వివరించారు. మంచి చేసిన ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, జెడ్పీ వైఎస్సార్‌సీపీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి, రిలాక్స్ నాగరాజు, కార్పొరేటర్లు మునిశేఖర్, శేఖర్‌బాబు, సాకే చంద్ర, రహంతుల్లా, కమల్‌భూషణ్, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైఫుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధా, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, మిద్దెనగేష్, రామయ్య, భారతి, శోభాబాయి, భానుమతి, గౌరి, ఉష, దేవి పాల్గొన్నారు.

నేడు 41వ డివిజన్‌లో:

41వ డివిజన్‌లో బుధవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జనశక్తి నగర్ ఆటోస్టాండ్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

పేదల పార్టీ వైఎస్సార్‌సీపీ

రాప్తాడురూరల్: పేదల పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనుంజయయాదవ్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి వైఎస్సార్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ధనుంజయయాదవ్, ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి మాట్లాడారు. పేదల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని స్థాపించారన్నారు. పార్టీలో, ప్రభుత్వం వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాలు, బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. రాజ్యాధికారం కల్పించారన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, అంబేడ్కర్ కలలను సాకారం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్, సందీప్‌యాదవ్, నాయకులు ఆకుల మునిశంకరయ్య, కురుగుంట లక్ష్మీరెడ్డి, శ్రీరాములు, పూలకంట భాస్కర్‌రెడ్డి, కక్కలపల్లి సర్పంచ్ కృష్ణయ్య, స్టోర్ డీలర్లు ఎర్రిస్వామి, లాలెప్ప, రమేష్, సుంకన్న, నిఖిల్‌యాదవ్, శ్రీరాములు, మునీర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మినరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, నాయకులు నాగరాజు, మల్లన్న, వెంకట్రాముడు, వన్నూరప్ప, ఫణిరెడ్డి, సద్దికూటి శివారెడ్డి, సురేష్, తరుణ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఓబీ టైలర్ వెంకటేష్, అంజినప్ప, ఆంజనేయులు, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: రాప్తాడులో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. 44వ జాతీయ రహదారిపై వైఎస్సార్ విగ్రహానికి వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి నివాళులర్పించారు. ర్యాలీగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం చేరుకొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పేదల పక్షమని, సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో చిరుతల నాగేంద్ర, ఎల్‌వీసీ వెంకటరాముడు, సాకే చంద్ర, జయన్న, బోయ రాము, మన్నల రవికుమార్, లోకేశ్వర్ రెడ్డి, గంజి అభి తదితరులు పాల్గొన్నారు.


రాప్తాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


వైఎస్సార్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ధనుంజయయాదవ్, ఎంపీపీ వరలక్ష్మీ

సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్ జగన్


ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద పార్టీ ఆవిర్భావ ఉత్సవాలు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా

అనంతపురం: సంక్షేమ పథకాల ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. జగనన్న పాలనలో గడప గడపకూ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సీనియర్ నాయకుడు గెలివి లింగా రెడ్డి, ఎంపీటీసీ సునీల్ దత్తా రెడ్డి, ఎస్కేయూ విద్యార్థి విభాగం నాయకులు చిగండి రమేష్, మన్నాల చిరంజీవి, హేమంత్ కుమార్, నితిన్ రెడ్డి, సురేష్, జయచంద్రా రెడ్డి, ముంటిమడుగు శరత్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో...

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎల్ఎం. మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సంకల్ప దీక్షకు ప్రతీక రంజాన్ ఉపవాసాలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి, మేయర్ వసీం సలీం

అనంతపురం కల్చరల్: రంజాన్‌సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం దాకా కఠిన ఉపవాసాలుండే ముస్లింల సంకల్ప దీక్ష గొప్పదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. రంజాన్ పర్వదినాలు ప్రారంభమైన తొలిరోజు మంగళవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం సలీం ఆత్మీయ అతిథులుగా హౌసింగ్‌బోర్డులోని ఉద్యాన్ మసీదులో, రెండవ రోడ్డులోని బహువుద్దీన్ మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్నారు. తొలి ఒక్కపొద్దులను సంప్రదాయసిద్ధంగా వదలిన అనంతరం ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. 30 రోజుల పాటూ నిర్విరామంగా ఎటువంటి ఆటంకం లేకుండా ఉపవాస దీక్షలు సాగిపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమలభూషణ్, సైఫుల్లాబేగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు ప్రారంభించారు. సాయంత్రం మసీదులో ఉపవాసం వదిలారు. అనంతరం మసీదులో ప్రార్థనలు చేశారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేద్దాం


ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజా రంజక పాలన సాగిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ పిలుపు ఇచ్చారు. మంగళవారం వారు రాప్తాడులో ఇంటింటా ఎన్నికల నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రెండో పర్యాయం జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరి స్వామి జన్మదిన ఉత్సవం

- ఘనంగా ఇఫ్తార్ వేడుకలు


వేడుకల్లో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం: జాతీయ రహదారి వడియం పేట ఆస్థాన- ఏ ఖాద్రీయా- వద్దనున్న (బనగానపల్లి స్వామి) ఆశ్రమంలో పవిత్ర రంజాన్ మొదటి రోజు మంగళవారం దస్తగిరి స్వామి జన్మదినోత్సవ ఉత్సవాలు, రంజాన్ ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం దస్తగిరి స్వామి జెండా ప్రతిష్టాపన, ఖురాన్ పఠనం నాతే షరీఫ్ తదితర కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ సలీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ పాల్గొన్నారు.

పొత్తు ఎవరి ప్రయోజనాల కోసమో చెప్పాలి

- ఎన్డీఏ కూటమిని ప్రజలు నమ్మరు
- మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్

అనంతపురం టవర్ క్లాక్ : బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఎన్డీఏ కూటమిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ ఆరోపించారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆయా పార్టీలు పరస్పరం విమర్శించుకొని ఇప్పుడు పొత్తు అని ప్రకటించడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు తెలియజేయాలన్నారు. బీజేపీతో పొత్తు రాష్ట్రానికి మంచిదని చంద్రబాబు ప్రకటించడం ఆయన అధికార దాహానికి నిదర్శనమని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ కూటమి ద్వారా దేశానికే కాదు రాష్ట్రానికి కూడా ప్రమాదకరమన్నారు. 400 ఎంపీ స్థానాల్లో ఎన్డీఏను గెలిపిస్తే రాజ్యాంగాన్ని సైతం మార్చేస్తానని ప్రధాని మోదీ అంటున్నారని, దానివల్ల నష్టపోయేది ప్రజానీకమేనన్నారు. పొత్తులో భాగంగా ఎలాంటి హామీలు పొందారో రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాపరెడ్డి, గాజుల వాసు తదితరులు పాల్గొన్నారు. పోలవరం పూర్తి చేస్తామన్నారా? లేక ఏపీకి బుందేల్ ఖండ్ తరహా హోదా ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందా అనే విషయాన్ని టీడీపీ, జనసేన స్పష్టం చేయాలన్నారు.

పుణె వెళ్లిన మహిళా హాకీ క్రీడాకారులు


క్రీడాకారులు దేవకి, నందిని, భరణి

అనంతపురం: పుణెలో ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న సీనియర్ జాతీయ స్థాయి మహిళా హాకీ పోటీలకు అనంతపురం నుంచి దేవకీ, నందిని, భరణి ఎంపికైనట్లు జిల్లా కార్యదర్శి అనిల్ రాజ్ కుమార్ తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు సంతనూతలపాడులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల హాకీ పోటీల్లో వీరు ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. వీరు మంగళవారం పుణె బయల్దేరి వెళ్లారు.

కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లు చేపట్టండి

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశాలు


మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్‌లో యూనిట్లకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్‌లో ఐదు రకాల యూనిట్లు ఉంటాయన్నారు. ఫీల్డ్ మేనేజ్మెంట్, ఎంసీసీ, కంప్లైంట్ రిసిట్, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్లకు సంబంధించి ఏర్పాట్లు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. యూనిట్‌లో ఎవరేమి చేయాలి అనే విషయంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. యూనిట్‌కు అందే ఫిర్యాదులు, ఇతర అంశాలకు సంబంధించి నివేదికలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వాహనాలకు, సమావేశాలకు, తదితర వాటికి అనుమతులు అందించే అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్


జూదరులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అనంతపురం: అనంతపురం నగరంలోని 4వ రోడ్డులో ఓ ఇంటిలో పేకాట ఆడుతుండగా త్రీటౌన్ సీఐ ధరణి కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 11 మందిని అరెస్ట్ చేసి నిందితులనుంచి రూ.15,200 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్టీసీ జోనల్ కార్యాలయంలో కలకలం

అనంతపురం క్రైం : అనంతపురంలోని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ కార్యాలయంలో మంగళవారం ఓ అగంతకుడు చొరబడి కలకలం రేపాడు. జోనల్ చైర్‌పర్సన్ పీఏ అవధాని శ్రీపాద తన గదిలో పనిలో నిమగ్నమై ఉండగా అగంతకుడు వచ్చి తలుపులు వేశాడు. గడియ పెట్టబోతుండగా శబ్దానికి అప్రమత్తమైన పీఏ 'ఎవరు' అని ప్రశ్నించగా తలుపు తెరిచాడు. వెంటనే ఆ వ్యక్తిని పీఏ లోనికి నెట్టి తలుపు వేసి గడియ పెట్టాడు. అనంతరం త్రీటౌన్ పోలీసులకు సమాచారమందించాడు. వారు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అగంతకుడు ఎవరు.. ఎందుకు చొరబడ్డాడు.. పీఏను ఎందుకు నిర్బంధించాలనుకున్నాడు.. అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఘనంగా కనకదాస గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

రాప్తాడు: రాప్తాడులో కనకదాస గ్రామోత్సవం మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కనకదాస విగ్రహాన్ని అలంకరించి, ఊరేగింపు చేశారు. విగ్రహం ముందు గొరవయ్యలు నృత్యం చేశారు. మహిళలు, యువతులు జ్యోతులు పట్టుకొని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాప్తాడులో బుధవారం ఉదయం 9 గంటలకు కనకదాస విగ్రహాన్ని ప్రతిష్టించి విశేష పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రజల ఐక్యతను దెబ్బతీయడమే బీజేపీ ధ్యేయం


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీసి తద్వారా ఎన్నికల్లో లబ్ధిపొందాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టాని తీసుకొచ్చిందని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. సీఏఏ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఒకటవ నగర కమిటీ మంగళవారం టవర్‌క్లాక్ వద్ద ఆందోళన చేపట్టింది. నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ వివక్షాపూరిత చట్టం అమలుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని గత పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాల బహిష్కరణ మధ్య ఎన్డీఏ అప్రజాస్వామిక రీతిలో ఆమోదించుకుందన్నారు. ఈ చట్టాన్ని ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి దానిని బలపరుస్తున్న మిత్ర పక్షాలను ప్రజలు ఓడించాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, బాలకృష్ణ, రాజు, గఫూర్, వెంకటేష్, లక్ష్మినారాయణ, బాబా, ఎర్రిస్వామి, శంషాద్, లక్ష్మిదేవి, ఫక్రుని, మాబున్నీ పాల్గొన్నారు.

ఎండోమెంటు భూముల కౌలుకు 22న వేలం

అనంతపురం కల్చరల్: ఉప్పరపల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించి గురుదాస్ కాలనీ సర్వే నం.214లోని 1. 50 ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 22న వేలం నిర్వహిస్తున్నట్లు గ్రూప్ దేవాలయాల ఈవో రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు.